నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
8 | మహబూబ్‌నగర్, సోమవారం 17 ఫిబ్రవరి 2025 | MAHABUBNAGAR NARAYANPET

రైతు వ్యతిరేకి కాంగ్రెస్‌ను నిలదీద్దాం



ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రైతు దీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న లక్ష్మారెడ్డి

- మాజీ మంత్రి మంత్రి లక్ష్మారెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 16 : రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న రైతు నిరసన దీక్షకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. మాజీ మంత్రి కేటీఆర్ హాజరవుతున్న ఈ కార్యక్రమ ఏర్పాట్లను లక్ష్మారెడ్డితోపాటు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ అమలు చేయడం చేతగాక ఢిల్లీ టూర్లతో టైంపాస్ చేస్తూ తెలంగాణ ప్రజలను నిండా ముంచుతున్నారని మండిపడ్డారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ కేసీఆర్ రైతుబంధు ఇవ్వగా, రేవంత్‌రెడ్డి రూ.15వేలు ఇస్తానని గొప్పలు చెప్పి రెండు పంటలు ఎగ్గొట్టి రూ.12వేలు ఇస్తామని మాటమార్చి అవి కూడా ఇవ్వడం చేతగాకపోయిందన్నారు. రుణమాఫీ చేయకుండా, రైతు భరోసా ఇవ్వకుండా, చివరకు పోసిన పాలకు బిల్లులు ఇవ్వకుండా రైతులను అరిగోస పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయం చేసుకుంటున్న భూములను బలవంతంగా లాక్కోవడం దుర్మార్గమన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ నిలబడుతుందని స్పష్టం చేశారు. రైతు నిరసన దీక్షకు రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్, నాయకులు శ్రీనునాయక్, జ్యోతయ్య, శ్రీను, బాలస్వామి, రమేశ్, సతీశ్, సైదుల్‌గౌడ్, జగన్, వెంకటేశ్, యాదయ్య, శేఖర్, దేవేందర్ పాల్గొన్నారు.

చేతగాని ప్రభుత్వాన్ని గద్దెదించాలి

వెల్దండ కార్యకర్తల సమావేశంలో అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ, ఫిబ్రవరి 16 : హామీల అమలులో పూర్తిగా విఫలమై, రైతులను మోసగించిన కాంగ్రెస్ పార్టీని గద్దెదిగాల్సిందేనని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆదివారం వెల్దండ మండల కేంద్రంలో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో అలివికాని హామీలిచ్చి నేడు వాటిని నెరవేర్చడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఏఒక్క వర్గం కూడా ఆనందంగా లేదన్నారు. రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయం చేస్తున్నారని, ఎన్నాళ్లని ప్రజలను మోసం చేస్తూ తప్పించుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, రైతులను మోసగించిన కాంగ్రెస్‌కు రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదన్నారు. ఈ నెల 18న ఆమనగల్లు పట్టణంలో నిర్వహించే రైతుదీక్షకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నారని తెలిపారు. రైతు దీక్షకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతుదీక్ష కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ పుట్టారాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, నిరంజన్, శేఖర్, మధుసూదన్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, భాస్కర్‌రావు, మాజీ సర్పంచులు అంజినాయక్, వెంకటేశ్వర్‌రావు, తిర్మల్‌రావు, అంజయ్య, బాల్‌లక్ష్మయ్య, సోమయ్య, హన్మంతు, లింగం, రాములు, నాయకులు ఆనంద్, అశోక్, రాజు, దేవేందర్, రమేశ్, కొండల్, రమేశ్‌గౌడ్, శ్రీను, రవి,సత్యం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రైతు మహాధర్నా..

కల్వకుర్తి, ఫిబ్రవరి 16 : ఆమనగల్లు మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 18వ తేదీన నిర్వహిస్తున్న రైతు మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మసత్యం వేర్వేరుగా పిలుపునిచ్చారు. రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు కేటీఆర్ వస్తున్నారని, నియోజకవర్గ రైతులు, ప్రజలు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

- పాద యాత్రతో తెలుసుకున్న ఆర్డీఎస్ రైతుల కష్టాలు
- కుర్చీ వేసుకొని నీటివాటా తేల్చుతానని హామీ
- ఇచ్చిన మాట ప్రకారం స్వరాష్ట్రంలో పుష్కలంగా నీళ్లు
- ఏడాదిలోపే తుమ్మిళ్ల లిఫ్ట్ పనులు పూర్తి

ఆర్డీఎస్ రైతుల కోసం పాదయాత్ర నిర్వహించిన కేసీఆర్(ఫైల్)

జోడు భూములు.. స్వేచ్ఛామలం

కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకం

- సీమాంధ్ర పాలనలో 35వేలకే పరిమితమైన సాగు
- తెలంగాణ వచ్చాక 87,500 ఎకరాలకు పెంపు

నడిగడ్డ పాలిట అపర భగీరథుడు కేసీఆర్

గద్వాల, ఫిబ్రవరి 16 : సీమాంధ్ర పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆర్డీఎస్ రైతాంగానికి సాగునీరు అందక తీవ్రంగా నష్టపోతున్నా ఇక్కడి పాలకులు పట్టించుకోలేదు. పైగా నడిగడ్డ ప్రజలను, రైతులను ఎండబెట్టిన ఇక్కడి నేత ఆంధ్ర నాయకుల వద్దకు వెళ్లి హారతులు పట్టారు. ఆర్డీఎస్ కింద వాస్తవంగా నడిగడ్డ రైతులకు 87,500 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఏనాడూ 35వేల ఎకరాలకు మించి నీరు పారలేదు. ఈ విషయం బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్‌రావు దృష్టికి నడిగడ్డ రైతులు తీసుకెళ్లారు. అందుకు చలించిపోయిన కేసీఆర్ నడిగడ్డ ఆర్డీఎస్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడానికి 2004 జూన్ 10వ తేదీన అలంపూర్ నుంచి 8రోజులు పాదయాత్ర చేశారు. రైతుల సమస్యలు విన్న కేసీఆర్ సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటం తప్పదని చెప్పి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నడిగడ్డ ప్రజల కోరిక నెరవేర్చుతానని చెప్పారు. ఆర్డీఎస్ రైతుల చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తానని మాట ఇచ్చారు. అవసరమైతే ఆర్డీఎస్ ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకొని కూర్చొని నడిగడ్డ రైతులను కాపాడుకుంటానని, చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తానని చెప్పారు. రాష్ట్ర అవతరణ తర్వాత తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో రాగానే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కేసీఆర్ ఆర్డీఎస్ ప్రాజెక్టు నుంచి మనకు వచ్చే నీటివాటను తీసుకుంటూనే రైతులకు రెండు పంటలకు నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని భావించి తుమ్మిళ్ల లిఫ్ట్ పనులకు శ్రీకారం చుట్టారు. పనులకు శ్రీకారం చుట్టిన ఏడాదిలోపే తుమ్మిళ్ల లిఫ్ట్ పనులు పూర్తి చేసి ఆర్డీఎస్ రైతుల చివరి ఆయకట్టుకు నీరు అందించారు. నాడు పాదయాత్రలో రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని నడిగడ్డ రైతుల కళ్లలో ఆనందం నింపారు. ఇది ఎప్పటికీ నడిగడ్డ ప్రజలు మరచిపోలేని సంఘటనగా గుర్తుండిపోయింది. గత కాంగ్రెస్ పాలకులకు ఎన్నికల నినాదంగా మారిన గట్టు ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి ఎడారిగా ఉన్న గట్టు ప్రాంతాన్ని పచ్చని పైర్లతో కళకళలాడే విధంగా చేస్తానని మాట ఇచ్చి గట్టు ఎత్తిపోతల పనులు ప్రారంభించి గట్టు ప్రజల చిరకాల వాంఛ తీర్చి ప్రజల మనస్సులో సుస్థిర స్థానం సంపాదించారు. గద్వాల మండలంలో దివి సీమగా ఉన్న గుర్రంగడ్డ గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం ఎన్నికల హామీగా మిగిలిపోగా, తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం గుర్రంగడ్డ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో గ్రామస్తుల కళ నెరవేర్చడంతో కేసీఆర్‌కు గ్రామస్తులు జీవితాంతం రుణపడి ఉన్నారు. నడిగడ్డ విద్యా, వైద్యపరంగా వెనుకబడిందని భావించి కేసీఆర్ జిల్లాకు గురుకులాలు ఏర్పాటు చేయడం తోపాటు నర్సింగ్, మెడికల్ కళాశాల మంజూరు చేసి 100 పడకల దవాఖానను 300 పడకలకు పెంచి చేయూతనిచ్చారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి గోస, ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా సాగుగోస తీర్చి నడిగడ్డ ప్రజల మనస్సులో స్థానం సంపాదించుకున్న గొప్ప వ్యక్తి కేసీఆర్.

అణగదొక్కేందుకు చూస్తే కన్నెర్ర చేద్దాం

- సగర శంఖారావం సభలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 16 : స్వాతంత్ర్యం వచ్చినాటి నుంచి బీసీలు అణగదొక్కబడుతున్నారని, పొలిటికల్ పవర్ ద్వారానే హక్కులను సాధించుకుందామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లో సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు అధ్యక్షతన సగర శంఖారావం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ అత్యధిక ఓట్లున్న మనం ఓట్లు వేసి మన హక్కులను సాధించుకునేందుకు జొలేపట్టి అడుగుతున్నామని, బీసీల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ హయాంలో సగరులకు హైదరాబాద్‌లోని కోకాపేటలో 200 కోట్ల విలువచేసే 2ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అందులో రూ.20కోట్లతో భవనం నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ కుల గణన పేరుతో 42శాతంగా చూపించడం సరికాదని, 61శాతం గా రాష్ట్రంలో బీసీలు ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలపై కపట ప్రేమ చూపి అన్యాయం చేస్తే కన్నెర్ర చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సగరుల డిమాండ్లన్నింటినీ ఏకీభవిస్తున్నామన్నారు. ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ బీసీలకు జరుగుతున్న అన్యాయం, సాధించుకోవాల్సిన హక్కులపై వివరించారు. సగర వెల్ఫేర్ సంస్థ చైర్మన్ మారుతిసాగర్, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి ఉన్నారు.

బ్యానర్‌తో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

గోకారం రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించాలి

- లేదంటే స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరిస్తాం
- ఎర్రవెల్లి, ఎర్రవెల్లితండా వాసుల నిరసన

చార కొండ, ఫిబ్రవరి 16 : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చార కొండ మండలంలోని గోకారం రిజర్వాయర్ నిర్మాణంలో ఎర్రవెల్లి, ఎర్ర వెల్లితండా ముంపునకు గురి కాకుండా రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో మాకు, మా ఊరికి జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను మూకుమ్మడిగా బహిష్కరిస్తామని హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు రాజకీయ పార్టీలు ఓట్ల కోసం గ్రామాలకు రాకూడదని ముందుగానే బ్యానర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. తమ గ్రామాలను, వ్యవసాయ భూములను కాపాడాలని వారు కోరారు. ప్రభుత్వం నుంచి తమకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామన్నారు.

ప్రజలంతా బీఆర్ఎస్ వైపే..

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, ఫిబ్రవరి 16 : ఏడాదిన్నర కాంగ్రెస్ చేతగాని పాలనకు ప్రజలు విసిగి వేసారారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మద్దిగట్లలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బాలస్వామి, తిరుపతయ్య, సుంకరి పెంటయ్య, వెంకటయ్య, మల్లయ్య తోపాటు పలువురు బీఆర్ఎస్ చేరారు. ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు నచ్చక బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే సకల జనులు అభివృద్ధి చెందినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, నర్సింహగౌడ్, సత్యనారాయణ, మురళీధర్ గౌడ్, నర్సింహారెడ్డి, చెన్నయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ఆవరణలో గులాబీ మొక్కను నాటి నీళ్లుపోస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

మల్దకల్ కేజీబీవీలో మొక్కలు నాటిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్‌కుమార్

కడుకుంట్ల శివారులో పంట పొలాల్లో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నేతలు

పెబ్బేరు రుశివారులోని వేరుశనగ పొలంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు..

పచ్చని పొలాల్లో తెలంగాణ జాతిపిత

కేసీఆర్ జన్మదిన వేడుకలు

- ఊరువాడ మొక్కలు నాటిన బీఆర్ఎస్ నాయకులు
- కడుకుంట్ల, పెబ్బేరులో రైతుల సమక్షంలో జన్మదినం
- వృక్షార్చనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 16 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి గులాబీ దళపతి, బీఆర్ఎస్ పార్టీ అధినేత, రైతుబంధు, హరిత స్వాప్నికుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నాగర్‌కర్నూల్‌లోని తన స్వగృహంలో గులాబీ మొక్కలు నాటి వృక్షార్చన చేశారు. సోమవారం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మాజీ ఎంపీ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే మర్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ రైతాంగం, ప్రజల తరపున కేసీఆర్‌కు ముందస్తు పుట్టిన రోజుశుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వనపర్తి మండలం కడుకుంట్లలో..

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 16 : మండలంలోని కడుకుంట్ల గ్రామంలో తెలంగాణ జాతిపిత, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినాన్ని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులోని పచ్చని పంట పొలాల మధ్య రైతులతో కలిసి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ మాట్లాడుతూ కేసీఆర్ పదేండ్ల పాలనలో కార్మికులు, కర్షకులు, రైతులు, విద్యార్థులు, మహిళలు చాలా సంతోషంగా గడిపారన్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో ముఖ్యంగా రైతులు గోస పడుతున్నారని, సాగునీరు సకాలంలో అందక, దిగుబడి తగ్గి మద్దతు ధర రాక బోనస్ లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడం పనిగా పెట్టుకొని సంక్షేమం అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు. కేసీఆర్‌కు రైతులన్నా, పచ్చని పొలాలన్నా ఇష్టమని అందుకే ఆయన జన్మదిన వేడుకలను పంట పొలాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు వాకిటి శ్రీధర్, రమేశ్‌గౌడ్, నాయకులు మాణిక్యం, హరి తాబాలకృష్ణ, సువర్ణాశ్రీను, గంధం పరంజ్యోతి, మాధవ్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నరసింహ, శివన్న సాగర్, సుధాకర్ చారి, రాము, జోహెబ్ హుస్సేన్, అరిఫ్, ఇమ్రాన్, ముని, శివ, లక్ష్మణ్, రామచంద్రయాదవ్, వెంకటసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరులో ఘనంగా..

పెబ్బేరు, ఫిబ్రవరి 16 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను పెబ్బేరులో ఆ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మత్స్య కళాశాల వద్దనున్న పంట పొలాల్లో వ్యవసాయ కూలీలు, రైతుల మధ్య ఆయన చిత్రపటాలు ఉంచి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రెస్వామి, నాయకులు ఎల్లారెడ్డి, ఎల్లయ్య, శాంతయ్య, సాయిరెడ్డి, బాల స్వామి పాల్గొన్నారు.

కేజీబీవీలో మొక్కలు నాటిన నాయకులు

మల్దకల్, ఫిబ్రవరి 16 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ నాయకులు మొక్కలు నాటుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ ఇచ్చిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా అందరూ మొక్కలు నాటి కేసీఆర్‌కు శుభాకాంక్షలు చెప్పాలన్నారు.

కార్యక్రమంలో గద్వాల్ గ్రీన్ ఇండియా చాలెంజ్ ఇన్‌చార్జి భీమన్న, బీఆర్ఎస్ నాయకులు మల్దకల్, సుధాకర్, రాంకుమార్, మల్దకల్, రాము, నర్సింహులు, తిమ్మప్ప, నీలిపల్లి నర్సింహ్మ, రమేశ్, రవితోపాటు తదితరులు పాల్గొన్నారు.